# వస

దీని వేరుకొమ్ములను ఎక్కువగా ఉబ్బసం, అతిసారం, జీర్ణకోశ సంబంధిత వ్యాధులకు మరియు జీర్ణ శక్తి వృద్ధి చేయుటకు ఉపయోగిస్తారు.

**నేలలు :** తేమగా ఉండే నేలలు, బంక నేలలు లేదా తేలికపాటి ఒండ్రునేలలు, ఎర్రనేలలు అనుకూలం. వరి పంట సాగు చేసే పద్ధతిలోనే దీనిని కూడా దమ్ముచేసి నీరు నిలువ ఉంచి సాగుచేయాలి.

**వాతావరణం :** ఉష్ణ, సమశీతోష్ణ మండలాలలో సాగుచేయవచ్చు. దీనికి 10-38$^0$ సెల్సియస్ ఉష్ణోగ్రత, 70-250 సెం.మీ. వర్షపాతం అనుకూలం.

**నేల తయారి** : పైన పేర్కొన్న విధంగా వరిపంటకు చేసిన విధంగా తయారు చేసి నీరు నిలువ ఉంచి నాటుకోవాలి. దమ్ము చేసినప్పుడు ఎకరానికి 8-10 టన్నుల పశువుల ఎరువు, 50 కిలోల నత్రజని, 50 కిలోల భాస్వరం మరియు 25 కిలోల పొటాష్ వేసుకోవాలి. నాటిన 3 నెలలకు ఒకసారి మరియు 6 నెలలకు మరొకసారి 25 కి॥ నత్రజని వేసుకోవాలి.

**నాటేదూరం** : వరుసకు వరుసకు మధ్య 60 సెం.మీ., మొక్కల మధ్య 30 సెం.మీ. దూరం పాటించాలి. త్రికోణపద్ధతిలో మొక్కలు నాటుకోవాలి.

**ప్రవర్ధనం** : వసను వేరు కొమ్ముల ద్వారా ప్రవర్ధనం చేస్తారు. ఎకరానికి షుమారు 27,000-30,000 పిలకలు అవసరం అవుతాయి.

**నాటే సమయం** : ఆగష్టు (8-9 నెలలు పంటకాలం)

**నీటి యాజమాన్యం** : తొలుత 5 సెం.మీ. తరువాత 10 సెం.మీ. నీరు నిలువ ఉంచాలి.

**అంతరకృషి :** మొత్తం పంటకాలంలో 4-6 సార్లు కలుపు తీయాలి. ప్రతిసారి మొక్క మొదలు దగ్గర మట్టిగట్టిగా నొక్కాలి.

**సస్యరక్షణ :** ముఖ్యంగా పిండి పురుగు మరియు గొంగళి పురుగు ఆశిస్తాయి. తెగుళ్ళలో ఆకుమచ్చ ముఖ్యమైనది.

నివారణ : (1) గొంగళి పురుగు నివారణకు లీటరు నీటికి వేపనూనె 4 మి.లీ. కలిపి ఆకుల మీద పిచికారి చేయాలి. అలాగే వేరు చుట్టూ తడపాలి.

(2) ఆకుమచ్చ తెగులు నివారణకు లీటరు నీటికి 1 గ్రా. మాంకోజెబ్ మరియు పిండి పురుగు నివారణకు లీటరు నీటికి క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. కలిపి పిచికారి చేయాలి. తప్పని సరి పరిస్థితులలోనే రసాయనిక పురుగు మందులు వాడాలి.

**కోత :** నాటిన 8-9 నెలల తరువాత పొలం పాక్షికంగా ఎండబెట్టి నాగలితో దున్ని వేరుకొమ్ములు తీయాలి. వీటిని 5-7 సెం.మీ. పొడవుగల ముక్కలు చేసి, కడిగి, పీచువేర్లు తొలగించి ఎండలో ఉంచాలి. ఎండిన తరువాత గరుకుగా ఉండే రాయికి రుద్ది పొలుసు తొలగించాలి.

**దిగుబడి :** ఎకరానికి 3-4 టన్నుల ఎండు కొమ్ముల దిగుబడి నిస్తుంది.

**ఆదాయ వ్యయాలు** : ఎకరానికి రూ. 20,000 ఖర్చు, రూ. 35,000-40,000 మొత్తం ఆదాయం తద్వారా షుమారు రూ. 15,000 నికరాదాయం లభిస్తుంది.